సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సీబీడీ కార్యాలయం, కామాక్షినగర్, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ముడసర్లోవ, గోల్ఫ్ క్లబ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు కోరారు.

త్రీటౌన్ పీఎస్‌ను సందర్శించిన సీపీ



త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార: నగరంలో లా అండ్ ఆర్డర్‌ను అదుపులో ఉంచుతూ అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా గురువారం రాత్రి 11 గంటలకు త్రీటౌన్ పీఎస్‌ను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. పెండింగ్ కేసులు, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణను శుభ్రంగా ఉంచాలంటూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సీపీతోపాటు ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ పల్లా రమణయ్య, సిబ్బంది ఉన్నారు.

ఏయూ బీవోఎస్ చైర్మన్‌గా నానాజీరావు



రిజిస్ట్రార్ ధనుంజయరావు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న నానాజీరావు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం బీవోఎస్ చైర్మన్‌గా ఆచార్య జి.నానాజీరావు నియమితుడయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో గురువారం నానాజీరావుకు ఉత్తర్వుల పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు అభినందించారు.

బాపన పోలమ్మ ఆలయ ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-9 మూలపాలెంలో ఆధునీకీకరించిన శ్రీ బాపన పోలమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. రూ.25 లక్షల సొంత నిధులు అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆయన విరాళం అందజేసిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంవీవీ ఆలయాన్ని ప్రారంభించి, అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా బాపన పోలమ్మ పండగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎంవీవీ తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గరికిన సీతారాం, మారుపల్లి పరదేశిపాలెం, కారి రామారావు, ఉమ్మిడి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న దివ్య కళా మేళాలో భాగంగా గురువారం స్టీల్‌ప్లాంట్ అరుణోదయ స్పెషల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహుతులను అలరించింది. అరుణోదయ స్కూల్ తరఫున సాంస్కృతిక కమిటీ సభ్యులుగా ఎం.ఇందుమతి, డి.శ్రావణి, కె.వి.పద్మ, సుబేదా బేగం వ్యవహరించారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన అరుణదోయ స్కూల్ యాజమాన్యానికి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

తంటాలు.. ఎన్నాళ్లు!

- అధ్వానంగా.. అభివృద్ధికి దూరంగా బాలికల వసతి గృహం రహదారి
- వర్షం పడితే విద్యార్థినులకు నరకయాతనే
- రాకపోకలకు అవస్థలు పడుతున్న స్థానికులు
- ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు



గోతుల రహదారిలో నడిచేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గిరిజన బాలికల వసతి గృహం వద్ద రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాకపోకల సమయంలో నరకం చూపిస్తోంది. ఆ రోడ్డును వినియోగించే వసతి గృహం విద్యార్థినులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎంవీపీ కాలనీ సెక్టార్-10లోని ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా వసతి గృహం అధికారులతోపాటు స్థానికులు జీవీఎంసీకి వినతిపత్రాలు సమర్పిస్తున్నా.. ఫలితం లేకపోయింది. ప్రధానంగా ఈ రహదారిలో ఉన్న గిరిజన బాలికల వసతి గృహంలో దాదాపు 400 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ బస చేస్తూ నగరంలోని వివిధ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ రహదారిలో విద్యార్థినుల రాకపోకలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం వర్షా కాలం కావడంతో ఈ రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. వర్షం పడితే చాలు గోతుల్లో పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండి నడిచేందుకు కూడా వీలు లేకుండా మారుతోంది. దీంతో విద్యార్థినులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. స్థానికులు సైతం అవస్థలకు గురవుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి ఈ రహదారిని పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలని స్థానికులు, విద్యార్థినులు కోరుతున్నారు.



వసతి గృహం రహదారిలో పార్క్‌చేసిన భారీ వాహనాలు



ఎంవీపీ కాలనీ సెక్టార్-10లో రహదారి వెంబడి నిలిచిన వర్షపు నీరు

భారీ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

ఈ రహదారి ఇప్పటికే అత్యంత అధ్వానంగా ఉండగా.. ఇక్కడే భారీ వాహనాల పార్కింగ్‌తో మరింత ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు, పొక్లెయిన్లను గుర్తు తెలియని వ్యక్తులు పార్క్‌చేసి వదిలేస్తున్నారు. రాత్రి పూట రహదారి మొత్తం వాహనాలతో నిండిపోతుండగా.. పగటి పూట సైతం అదే పరిస్థితి. ఈ రోడ్డులో చేపడుతున్న ఓ బహుళ అంతస్తుల ప్రాజెక్టు నిర్మాణ పనుల కారణంగానే భారీ వాహనాలను పార్క్‌చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ కారణంగా కూడా రహదారి చిన్నాభిన్నం అయినట్లు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై సైతం అటు వసతి గృహం అధికారులు.. ఇటు స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: ఇసుక లభించడం లేదంటూ భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో గురువారం 10వ వార్డు రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద నిరసన చేపట్టారు. ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎ.రమణ, సీఐటీయూ నాయకుడు కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు 200 మంది కార్మికులు ఉన్నట్లు తెలిపారు. గతంలో వారందరికీ రోజూ పని దొరికేదన్నారు. ఇప్పుడు ఇసుక లేకపోవడంతో రోజుకు వారిలో 10 మందికి మించి పని దొరకడం లేదని చెప్పారు. సుమారు మూడు నెలలుగా ఇదే పరిస్థితితో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఉచితంగా ఇసుక అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు దానిని గాలికి వదిలేశారన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో మూడు యూనిట్ల ఇసుక రూ.13,000 ధర ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.21,000కు ధర పెరిగిందని చెప్పారు. ఇసుక ధర పెరగడం వల్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. దీంతో కార్మికులకు పని లభించక ఆకలి మంటలతో గడపాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో కార్మికులు నాగరాజు, రాము, సన్యాసమ్మ, సూర్యానారాయణ, ఎస్‌కే వల్లి, శ్రీను పాల్గొన్నారు.

సమాన వేతనం చెల్లించాలని డిమాండ్



మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, విమ్స్ కార్మికులు

ఆరిలోవ: కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మహా ధర్నా పోస్టర్‌ను గురువారం సీఐటీయూ నాయకులు విమ్స్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆరిలోవ జోన్ నాయకుడు నరేంద్రకుమార్ మాట్లాడుతూ నెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న మహాధర్నాలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహా ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. విమ్స్‌లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలనీ వేతనాలు పనిచేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, విమ్స్ కార్మికులు రాజేశ్వరి, కనకరాజు, అన్నపూర్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌పై అవగాహన అవసరం



ఐఐహెచ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎల్వీపీ కంటి వైద్యులు

ఆరిలోవ: కంటి సంబంధితమైన ఇడియోపతి ఇంట్రాక్రానియల్ హైపర్‌టెన్షన్(ఐఐహెచ్) గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య నిపుణులు తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలలో గురువారం ఐఐహెచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ మాట్లాడుతూ గర్భధారణ వయసులో ఉన్న మహిళల్లో ఊబకాయంతోపాటు కంటి నరం సమస్యలు ఉంటాయన్నారు. స్టెయిడ్స్, విటమిన్ ఏ సప్లిమెంట్, నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు, దీర్ఘకాలికంగా పనిచేసే టెట్రాసైక్లిన్ మాత్రలు అధికంగా వాడిన వారిలో కంటి నరాల సమస్యలు రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వీటి వల్ల కంటి నరాలు వాపునకు గురవుతాయన్నారు. తొలనొప్పి, ద్వంద్వ దృష్టి, దృష్టిలో అస్పష్టత, చెవుల్లో మోగుతున్నట్లు శబ్దం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అవి ఉన్న వారు వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. ఐఐహెచ్ సమస్య నివారణలో ఆప్తమాలజిస్టులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. అనంతరం ఐఐహెచ్ పోస్టర్‌ను కంటి వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం



లోకేష్‌కు చెక్ అందజేస్తున్న మస్తానరావు కుటుంబ సభ్యులు

కొమ్మాది: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నగరానికి చెందిన హిందూస్థాన్ ఎంటర్‌ప్రైజస్ ఎండీ పి.ఎస్.మస్తానరావు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. బీచ్‌రోడ్డులోని ఓ రిసార్ట్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలసి ఈ మొత్తం చెక్‌ను అందించారు. ఆయన కుటుంబ సభ్యులు కుంకుమ రేఖ, భరత్, శ్రీలేఖ పాల్గొన్నారు.

డ్వామా పీడీ పూర్ణిమాదేవి బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పీడీగా ఉన్న ఈ.సందీప్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పూర్ణిమాదేవిని డ్వామా పీడీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

‘టీ విత్ ఎవ్రీథింగ్’ నాటక ప్రదర్శన రేపు



వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

మద్దిలపాలెం: హైదరాబాద్‌కు చెందిన పురాతన దిటోర్న్ కర్టెన్స్ థియేటర్ గ్రూప్ వ్యవస్థాపకుడు మాలా పాషా ఆధ్వర్యంలో ఈ నెల 28న బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌లో టీ విత్ ఎవ్రీథింగ్ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పార్క్ హోటల్ ప్రతినిధులు తెలిపారు. హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ నాటక కళా ప్రియుల కోసం ఇక్కడ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. నవరసాల సమ్మేళనభరితంగా నాటక ప్రియుల హృదయాలను హద్దుకునేలా నాటకం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు టికెట్ల కోసం 99596 11757, 87122 68675 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్లు జలమయం

- ఏఎస్ రాజా కూడలిని ముంచెత్తిన వర్షపు నీరు
- వాహన చోదకులకు ఇక్కట్లు.. లీకైన యూజీడీలు



జలమయమైన ఏఎస్ రాజా కూడలి



లాసన్స్ బే కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



యూజీడీ ఉప్పొంగి బయటకు వస్తున్న మురుగు నీరు

ఎంవీపీకాలనీ: భారీ వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కూడలి జలమయమైంది. రెండు రోజులుగా కురుస్తున్న వాన కారణంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో ఒక్కసారిగా రహదారులపై పెద్ద ఎత్తున నీరు చేరింది. ఏఎస్ రాజా కూడలి నుంచి నాలుగువైపులా నుంచి వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో ఐ హాస్పిటల్, ఇసుకతోట కూడలి, బీచ్ వైపు నుంచి వచ్చే వాహన చోదకులు రాకపోకలకు తంటాలు పడ్డారు. ట్రాఫిక్ సైతం జామైంది. వర్షం కారణంగా ఎంవీపీ కాలనీలోని పలు చోట్ల రోడ్లు నీటమునిగాయి. యూజీడీలు లీకై మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చింది. పలు చోట్ల యూజీడీ లైన్లు ఉప్పొంగాయి. దీంతో పాదచారులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జోరువాన ధాటికి హనుమంతవాక నుంచి లాసన్స్ బే కాలనీ తీరం వరకు విస్తరించి ఉన్న గెడ్డ పోటెత్తి ప్రవహించింది.

జోరువానలో రిక్షావాలా జీవన పోరాటం



ఎంత కష్టం.. ఎంతకష్టం.. రెక్కాడితే కాని డొక్కాడని ఓ రిక్షావాలా బండిపై బండెడు సామగ్రితో జోరువానలో తడుచుకుంటూ.. ఈసురోమని రిక్షాను లాగుతూ వెళ్తున్న దృశ్యం అందరి హృదయాలను కదలించింది. గురువారం కురిసిన వర్షపు హోరులో వీఎంఆర్‌డీఏ వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి వాల్తేరు క్లబ్‌పై కాస్తా ఎత్తులో ఉండే రోడ్డుపై రిక్షా లోడుతో లాక్కుంటూ వెళ్లడం అటుగా వెళ్తున్న వారిని కట్టిపడేసింది. పొట్టకూటి కోసం మెరుపులతో కూడిన వర్షంలో సైతం జీవనయాత్ర సాగించాడు. – మద్దిలపాలెం

‘మన్యం ధీరుడు’ చిత్ర యూనిట్ సందడి



సక్సెస్ మీట్‌లో మన్యం ధీరుడు చిత్ర బృందం

మద్దిలపాలెం: ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 20న విడుదలైన మన్యం ధీరుడు సినిమా విజయవంతంగా అన్ని థియేటర్లలో ప్రదర్శితమవడం, దీనికి ప్రేక్షకులు ఆదరాభిమానాలు మెండుగా ఉండటంతో చిన్న సినిమాలకు ఊపిరి పోసినట్లయిందని హీరో, నిర్మాత ఆర్.వి.వి.ఆర్.సత్యనారాయణ అన్నారు. సక్సెస్ మీట్‌లో భాగంగా గురువారం చిత్ర యూనిట్ మద్దిలపాలెం సీఎంఆర్ ఐనాక్స్‌లో సందడి చేసింది. అనంతరం దర్శకుడు డెక్కల నరేష్ మాట్లాడుతూ సినిమా తీస్తున్నప్పుడు తాముపడ్డ కష్టమంతా ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణతో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. తమ సినిమాకు ఘన విజయం అందించిన ప్రేక్షక దేవుళ్లకు రుణపడి ఉంటానన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ రాజు మాట్లాడుతూ చాలా ఏళ్ల కిందట ఒక గొప్ప హీరో నటించి ప్రజలను మెప్పించిన అల్లూరి సీతారామరాజు చిత్రం.. ఆ పాత్రను సత్యనారాయణ పోషించి తగిన న్యాయం చేశారన్నారు. నేటి యువతరానికి స్వాతంత్య్ర పోరాట యోధుల జీవిత చరిత్రను సాక్షాత్కరించేలా సినిమా ఉందని అభినందించారు. హాస్యనటుడు అప్పారావు మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో సినిమాకు చిరస్థాయిగా స్థానం ఉండేలా ఎంతో అద్భుతంగా తెరకెక్కించారన్నారు. చిత్రంలోని పాటలను హీరో, నిర్మాత సత్యనారాయణే స్వయంగా పాడారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, హాస్యనటుడు సత్తిపండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి జూలో వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, జూ అవుట్‌రీచ్, రీల్ మేకింగ్, బటర్‌ఫ్లై రన్నింగ్ వర్క్‌షాప్, సీడ్ బాల్ మేకింగ్, బర్డ్ వాక్, ఫొటోగ్రఫీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94408 10213ను సంప్రదించాలని సూచించారు.

ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం సిరిపురంలోని లోటస్ ఆస్పత్రి యూనిట్-1, 2లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిజిస్ట్రేషన్ ఉన్నదీ.. లేనిదీ తనిఖీ చేశారు. 5 శాతం ఉచిత స్కానింగ్ చేస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే సైన్ బోర్డు ప్రదర్శించాలని సూచించారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

ఉత్సాహంగా హెరిటేజ్ వాక్

అల్లిపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా జిల్లాలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను తెలిపే విధంగా హెరిటేజ్ వాక్ పేరుతో గురువారం చేపట్టిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. జిల్లా టూరిజం కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ టౌన్‌హాల్ వద్ద ప్రారంభమై.. పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా టూరిజం అధికారులు బ్యానర్లు ప్రదర్శించి.. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యాన్ని గుర్తించి, గౌరవించాలని నినదించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి, జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవాణి, ఏపీటీడీసీ ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఏపీపీటీడీ చైర్మన్ నారాయణను సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యవర్గం

మద్దిలపాలెం: ఏపీపీటీడీ రాష్ట్ర చైర్మన్‌గా నియామకమైన మాజీ ఎంపీ కొనగళ్ల నారాయణను గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులంతా గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంస్థ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు చైర్మన్‌గా, సీనియర్ నాయకుడిగా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శులు ఆర్.సుబ్బారావు, రాజేష్‌కుమార్, కోశాధికారి పి.వి.మోహన్, జోనల్ కార్యదర్శి ఎ.రామారావు, నాన్ ఆపరేషన్ కార్యదర్శి కల్యాణ్, వర్క్‌షాప్ కార్యదర్శి వాసు చైర్మన్‌ను కలిశారు.